


# యుద్ధానికి సిద్ధం

సాఫీగా రోజులు గడిచిపోతున్నాయి అనుకుంటూ ఉంటే గగ్గోలు రేకెత్తింది ఒక్కసారిగా. చైనా యుద్ధం, ఇక ఎక్కడచూసినా ఒకటే చర్చ. సినిమాలూ షికార్లూ పక్కనపెట్టి మా నాన్నగారు, తాతగారు, బాబయ్యలూ మామయ్యలూ రేడియోల దగ్గర కూర్చుని వార్తలు వినడం, న్యూస్‌పేపర్లు చదవడంలో మునిగిపోయారు.

గంటల తరబడి యుద్ధం గురించి మాట్లాడుకోవడం.

మా స్కూల్లోనూ అదే వాతావరణం. పాఠాలన్నీ చెట్టెక్కాయి. ప్రతి టీచరూ మొక్కుబడిగా పాఠం మొదలుపెట్టినా అయిదు నిమిషాల తర్వాత ఆటోమేటిక్‌గా యుద్ధం గురించి మాట్లాడేవారు. ఇక బెల్ కొట్టేదాకా అదే సాగిపోయేది.

గతంలోని సంఘటలన్నీ తవ్విపోసి స్వతంత్రంకోసం ఎంతకాలం ఏవిధంగా పాటుపడ్డారో చెప్పేవారు. ఎన్నో వీరగాథలు. అల్లూరి సీతారామరాజు, నేతాజీ, వీరసావర్కర్ – ఒకటా రెండా హృద్యంగా వాళ్ళు చెప్తుంటే ఒళ్ళంతా చెవులు చేసుకుని వినేవాళ్ళం.

'అంత కష్టపడి స్వతంత్రం తెచ్చుకుంటే మళ్ళీ ఈ ఆపద ఏమిటి' అని మాలో మేమే మాట్లాడుకునేవాళ్ళం.

రానురాను గంభీరంగా తయారైంది వాతావరణం.

పాపం మన సైనికుల దగ్గర చాలినంత మందుగుండు సామాగ్రి లేదుట. మంచి బూట్లుకూడా లేవుట-అని పెద్దవాళ్ళు బాధపడుతుంటే మాకూ జాలివేసేది.

దేశరక్షణ నిధికి ఉదారంగా విరాళాలు ఇవ్వమని చెప్పారుట నెహ్రూగారు. ఇక సందడి మొదలయ్యింది. మా నాన్నగారి ఆఫీసులో వాళ్ళందరూ ఒకరోజు జీతం విరాళంగా ఇచ్చారుట. వాళ్ళ ఆఫీసువాళ్ళే కాదు, అందరు ప్రభుత్వోద్యోగులూ అట్లాగే ఇచ్చారుట.

"మీకంటే జీతాలూ భత్యాలూ ఉన్నాయి. మాకేం ఉంటాయి. మేమేం ఇవ్వగలం" అని వాపోయింది అమ్మ. "మీకు ఉన్న దానిలోనే మీరూ ఇవ్వండి" అన్నారు నాన్న.

మర్నాడు ఓ చిన్న మట్టిముంత తెచ్చి బల్లమీద పెట్టింది అమ్మ. అరవీసె కూరకి బదులు మూడు అర్ధపావులు కూరకొని మిగిలిన చిల్లర ఆ ముంతలో వేసింది. మాకూ అలాగే వెయ్యమని చెప్పింది.

ఎవరైనా పెద్దవాళ్ళు మాకు ఏ పావలానో ఇస్తే అందులోంచి ఒక పదిపైసలు ఆ ముంతలోవేసి మిగిలిన దానితోనే చిరుతిళ్ళు కొనుక్కునేవాళ్ళం.

మాలాటి మామూలువాళ్ళు ఇంతేకానీ కలిగినవారు నగలూ నాణ్యాలూ దోసిళ్ళతో ఇచ్చారుట దేశరక్షణ నిధికి.

మా తాతమ్మా వాళ్ళు సాయంత్రం దీపాలు పెట్టాక మమ్మల్నందర్నీ ఒకచోట పోగేసి దేశానికి వచ్చిన విపత్తు తొలగిపోవాలని మాచేత భజన చేయించేవాళ్ళు.

ఒకరోజు సాయంత్రం వార్తలు వింటూ మగవాళ్ళంతా బిగుసుకుపోయారు. మాటా పలుకూ లేకుండా గంభీరంగా ఉండిపోయారు. 'వంటయింది లేవండి' అని ఆడవాళ్ళు ఎంత మొత్తుకున్నా వింటేనా! ఆ పూట ఎవరూ ఎంగిలిపడలేదు.

విషయం ఏమిటని అడగాలన్నా 'పిల్ల వెధవలు మీకెందుకు పెద్దవాళ్ళ విషయాలు' అంటారని భయంవేసింది. తెల్లారి వార్తలు విన్నాక ధైర్యంచేసి అడిగేశాను మా నాన్నగారిని.

"చైనావాళ్ళు ముందుకు చొచ్చుకు వస్తున్నారుట. మన భూభాగంలో చాలా వంతు వాళ్ళ వశమైపోయిందిట."

వింటూ ఉంటే నాకూ భయంవేసింది. "మరి వాళ్ళు ఢిల్లీదాకా వచ్చేస్తేనో?" అని అడిగాను.

"అంతదాకా రానిస్తామా? అవసరం అయితే మనందరం వెళ్ళి వాళ్ళతో యుద్ధం చేస్తాం. వాళ్ళని వెళ్ళగొడతాం!" అన్నారు ఆవేశంగా నాన్నగారు.

ఆవేళ స్కూల్లో పాఠాలూ కథలూ ఏమీ లేవు. పాటలొచ్చిన పిల్లలని బ్లాక్‌బోర్డు దగ్గర నిలబెట్టి దేశభక్తి గీతాలు పాడించారు. పెందలాడే ఇళ్ళకు పంపించేశారు. మా ఫ్రెండ్సందరితోనూ మా నాన్నగారికీ నాకూ జరిగిన సంభాషణ చెప్పాను.

పరిస్థితి చూస్తుంటే ఆందోళనకరంగానే అనిపించింది నాకు. మా అన్నయ్యతో చర్చించాను. అల్లరి పనులంటే ఆమడదూరంగా ఉంటాడు కానీ ఇటువంటి పనులకు ముందే ఉంటాడు అన్నయ్య.

ఇద్దరం కలిసి ప్లాను వేశాం. పిల్లలందర్నీ పోగేశాం. విషయం వివరించాం. "అవసరం అయితే మనందరం యుద్ధానికి వెళ్ళాలిట. మా నాన్నగారు చెప్పారు" అన్నాం.

"మరి మా నాన్నగారు మాకేం చెప్పలేదే" అంది మా పక్కింటి రాజ్యలక్ష్మి. "ఏమోమరి! మేం మాత్రం యుద్ధానికి వెళ్తున్నాం. మీ విషయం అంటారా మీ ఇష్టం. మీకు చెప్పకుండా వెళ్తే తర్వాత పోట్లాడతారని చెప్పేం. అంతే" అని చెప్పేశాను.

"మీతో మేమూ వస్తాం" అన్నారు వాళ్ళుకూడా.

"సరే అయితే. యుద్ధానికి ఎవరెవరు వస్తారో చేతులెత్తండి" అన్నాడు అన్నయ్య. అందరూ చేతులెత్తారు.

ఏం చెయ్యాలో ఎలా చెయ్యాలో వివరంగా చెప్పాడు అన్నయ్య.

అందరం సామాన్లు సర్దుకున్నాం. నేను నా స్కూలు బేగ్‌లో పుస్తకాలతోబాటు రాచ ఉసిరికాయలు కూడా సర్దుకున్నాను.

పెందలాడి భోజనాలుచేసి అందరం అరుగుమీదికి చేరాం. అందరూ ఒక దగ్గరే ఉంటే సుఖం కదా! వాళ్ళు పిలవగానే గభాల్న వెళ్ళిపోవచ్చు యుద్ధానికి. అందులో ఈ పెద్దవాళ్ళని నమ్మడానికి లేదు. ఆఖరి క్షణంలో కంగారు పెట్టేస్తారు.

మా అన్నయ్యకి చాలా విషయాలు తెలుసు. మన రక్షణమంత్రి కృష్ణమీనన్ గారుట. ఆయన యుద్ధం దగ్గరికి వెళ్ళరుట. ఢిల్లీలో ఉండి ఎలా యుద్ధం చెయ్యాలో చెప్తారుట. ఆ విషయాలన్నీ వింటూ ఎప్పుడు నిద్రపోయామో, ఎప్పుడు మమ్మల్ని ఎత్తుకొచ్చి మంచంమీద పడుకోబెట్టారో మాకు గుర్తులేదు.

ప్రతిరోజూ ఇదే తీరు. అందరం రెడీగానే ఉన్నా మమ్మల్ని ఇంకా పిలవనేలేదు... అంతలోనే యుద్ధం ఆగిపోయిందని కబురు. మేము యుద్ధానికి వెళ్ళలేకపోయామని తెగబాధపడిపోయాం, మమ్మల్ని పిలవకుండానే యుద్ధం ఆపేసిన పెద్దవాళ్ళని తెగ తిట్టుకున్నాం.

* * *